

# న్యాయమందిరం

వేలూరి వెంకటేశ్వరరావు

ముక్కోటి దేవతలు సర్వదా దీవిస్తూ కాపాడుతున్న ఒక ప్రాచీన పుణ్యభూమి. ఈ పుణ్యభూమిలో ముగ్గురు దేవతామూర్తులు మూడు పక్కలా ఎల్లలుగా మూర్తీభవించిన ఒక సామంత రాజ్యం. ఈ సామంత రాజ్య రాజధానిలో ప్రధానం రాజ్యాంగ భవనం. రాజ్యాంగ భవనానికి పెద్ద సింహద్వారం. ఏడు ద్వారాలు దాటిన తర్వాత లోపల న్యాయమందిరం. న్యాయమందిరం చిక్కని కాషాయరంగులో ధగధగ మెరుస్తొందిట!



రాజ్యాంగ భవన సింహద్వారం ఎదురుగా, వెలిసిపోయిన కాషాయరంగు జుబ్బాలో, మధ్యమధ్యలో మీసం మెలివేస్తూ, అహర్నిశలూ పహరా కాస్తున్న ఆజాను బాహువు.

ఈ సామంత రాజ్యంలో ఓ మారుమూల పేరులేని పల్లెటూరు నుంచి ఓ పల్లెటూరి బైతు, నానా యాతనలు పడి, ఒక రోజున రాజ్యాంగ భవన సింహద్వారం చేరుకున్నాడు. 'అమ్మయ్య!' అనుకుంటూ, నెత్తిమీంచి అల్లిక బుట్ట కిందకి దించుకున్నాడు. ఆ బుట్టలో అతని ఆస్తిపాస్తులు సర్వస్వం వున్నాయి. సింహద్వారం దగ్గిర పహరా కాస్తున్న కాషాయ జుబ్బావాడికి వంగి సలాంచేసి, న్యాయమందిరంలోకి పోవడానికి అనుమతించమని ప్రార్థించాడు. పహరావాడు 'ఇప్పుడు లోపలికి వెళ్ళటానికి వీల్లేదు' అన్నాడు, మీసం దువ్వుతూ. పల్లెటూరి బైతు ఒక్క క్షణం ఆగి, 'పోనీ కొంతసేపయిం తర్వాత న్యాయమందిరంలోకి వెళ్ళడానికి వీలవుతుందా?' అని ప్రాధేయపడుతూ అడిగాడు. కాషాయజుబ్బావాడు మీసం మీద నుంచి చెయ్యి తీస్తూ, 'చూద్దాం. కానీ యిప్పుడు మాత్రం కుదరదు' అని నిష్కర్షగా చెప్పాడు.

సింహ ద్వారం తలుపుల్ని బార్లగా తీసివున్నాయి. అహర్నిశలూ ఈ తలుపులు యిలా తీసే వుంటాయట! పహరావాడు ఓ పక్కకి ఒదగంగానే, పల్లెటూరి బైతు వంగి, మరో పక్కనుంచి ఆశగా లోపలికి చూస్తున్నాడు. అది కనిపెట్టిన పహరావాడు ఫక్కున నవ్వి 'నీకంత కుతూహలంగా వుంటే, నా మాట ఖాతరుచెయ్యకుండా నన్నెదిరించి లోపలికిపో. కానీ ఒక విషయం. నాకు చాలా అధికారం వుంది. ఆ రెండో ద్వారం దగ్గిర మరో పహరావాడున్నాడు. వాడి కాషాయ జుబ్బా, నా కాషాయ జుబ్బా కన్నాకొంచెం ముదురు రంగు. వాడికి నాకన్న ఎక్కువ అధికారం వుంది. అలాగే మూడో ద్వారం దగ్గిర పహరావాడికి రెండో పహరావాడికన్నా ఎక్కువ అధికారం. వాడి జుబ్బా యింకొంచెం ముదురు రంగులో వుంటుంది. అసలు, ఆ ఏడో పహరావాడు కళ్ళు జిగేల్‌మనే కాషాయ జుబ్బా వేసుకొంటాడు. వాడికి మా అందరికన్నా ఎక్కువ అధికారం వుంది. అది దాటాలి, న్యాయమందిరంలోకి పోవాలంటే. అందాకా ఎందుకు? ఆ మూడో పహరావాడిని నేను కన్నెత్తి సూటిగా కూడా చూడలేను. నాకు వాడంటే తెగ భయం. వాడు ప్రళయరుద్రుడు,' అని ముగించాడు.

పల్లెటూరి బైతు నిలువునా నీరయిపోయాడు. న్యాయమందిరంలోకి వెళ్ళటానికి యింత హైరానపడాలని కలలోకూడా అనుకోలేదు. న్యాయమందిరం అంటే బయిస్కోపులో బృందావనం అని అపోహపడ్డాడు. న్యాయమందిరం అందరికీ ఎప్పుడూ అందుబాటులో వుంటుందని ఆశపడ్డాడు, అమాయకంగా. 'ఎలాగూ యింత దూరం వచ్చాం; పోనీ కాస్సేపు ఆగితే, ఈ పహారావాడికి దయ కలగకపోతుందా' అని అనుకొని, అక్కడే చతికిలపడ్డాడు నేలమీద. పహరావాడు కాస్సేపు అటూ యిటూ తిరిగి, ఓ చిన్న ముక్కాలిపీట తెచ్చుకొని దాని మీద కూచున్నాడు.

పల్లెటూరి బైతు రోజంతా అలాగే కూచున్నాడు. పహరావాడు ఉలకలేదు; పలకలేదు. రోజులు గడిచాయి, నెలలు గడిచాయి; పల్లెటూరి బైతు నేల మీద, పహరావాడు ముక్కాలి పీట మీద. మధ్యమధ్యలో పల్లెటూరి బైతు పహరావాణ్ణి ఏవేవో కుశల ప్రశ్నలు వేస్తున్నాడు; పిల్లాజెల్లా వివరాలన్నీ అడుగుతున్నాడు. పహరావాడు రాచఠీవితో 'హు, ఉహు' అంటూ ముక్తసరిగా, విసుగుతో సమాధానాలు చెప్పతున్నాడు. పల్లెటూరి బైతు తన బుట్టలో తెచ్చిన వస్తువులన్నీ పహరా కాస్తున్న కాషాయ జుబ్బావాడికి లంచంగా యిచ్చేశాడు. వాడు అన్నీ చల్లగా తీసుకుంటూ—'నేను యివన్నీ ఎందుకు పుచ్చుకుంటున్నానో తెలుసా? బహుశః నువ్వేదన్నా మరిచిపోయి వుంటే, అది కూడా నీకు గుర్తుకొస్తుందేమో అని' అన్నాడు జాలి నటిస్తూ.



సంవత్సరాలు గడిచాయి. పల్లెటూరి బైతు మిగిలిన పహరావాళ్ళ గురించి మరిచేపోయాడు.వాడి ఉద్దేశ్యంలో ఈ కాషాయ జుబ్బా పహరావాడొక్కడే ఆటంకం. వీడిని దాటితే, తను న్యాయమందిరంలోకి పోవడం సులభం అని తనలో తాను గొణుక్కున్నాడు. ఆ ఆశతో యింకా కొన్ని ఏళ్ళు గడిచాయి.పల్లెటూరి బైతు వృద్ధుడైపోయాడు, ఆ సింహద్వారం ముందే! కళ్ళు కనిపించ డం లేదు; చెవులువినిపించడం లేదు—మాటలు తడబడుతున్నాయి. నడుం వంగి విల్లయిపోయింది. అవసానకాలం సమీపిస్తున్నదని తెలిసిపోయింది. ఆఖరిసారిగా, పహరావాణ్ణి ఏదో అడగాలని సౌంజ్ఞ చేశాడు. పహరావాడు 'ఇంకా ఏమిటడగాలనుకుంటున్నావ్?' అన్నాడు విసుగ్గా. పల్లెటూరి బైతు వణుకుతూ 'అయ్యా! ఒక్క సందేహం. ప్రతి మనిషికీ న్యాయమందిరంలోకి వెళ్ళాల్సిన అవసరం ఎప్పుడో ఒకప్పుడు వస్తుందంటారు. మరి అదే నిజమయితే, నేను యిన్ని సంవత్సరాలుగా, యీ సింహద్వారం దగ్గిర పడిగాపులు పడుతున్నాను, ఒక్క మనిషైనా వచ్చి, లోపలికి పోవడానికి మీ అనుమతి అడిగినట్టు కనిపించదు, కారణం?' అన్నాడు.

పహరాకాస్తున్న కాషాయజుబ్బావాడికి పూర్తిగా బోధపడింది—పల్లెటూరి బైతుకి అవసాన దశలో జ్ఞానోదయం అవుతూన్నదని. పహరావాడు వంగి, పల్లెటూరి బైతు చెవి దగ్గిర బిగ్గరగా అరచాడు: 'ఏ ఒక్కడూ ఈ సింహద్వారం ద్వారా లోపలికి పోలేదు. ఇది ప్రత్యేకంగా నీబోటిగాళ్ళకోసమే; న్యాయమందిరంలోకి వెళ్ళేందుకు ఎన్నో రహస్య ద్వారాలున్నాయి!'' అంటూ సింహద్వారం తలుపులు ఫెళ్ళున మూసేశాడు.

*